19,701 హెక్టార్లలో పంట నష్టం

- నష్టపోయిన 47,517 మంది రైతులు
- మడకశిరలో రూ.28.63 కోట్ల పరిహారానికి ప్రతిపాదనలు
- రైతులకు నష్టపరిహారం అందించడానికి ప్రభుత్వం కసరత్తు


ఎండిపోయిన మొక్కజొన్న పంట

మడకశిర: నియోజకవర్గంలో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో భారీ ఎత్తున పంట నష్టం జరిగింది. ఐదు మండలాల్లోనూ సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో రైతులకు దుస్థితి ఏర్పడింది. ప్రారంభం నుంచి చివరి వరకు ఈ ఏడాది వర్షాలు పడలేదు. ఫలితంగా రైతులు రూ.కోట్లు విలువ చేసే పంటను కోల్పోయారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా వేరుశనగ పంటను సాగు చేశారు. అలాగే కంది, మొక్కజొన్న, రాగి తదితర పంటలను కూడా సాగు చేశారు. అయితే వర్షాభావం కారణంగా పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది.

రూ.28.63 కోట్ల పంటనష్టం

నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 19,701 హెక్టార్లలో రైతులు వివిధ పంటలను నష్టపోయారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. మొత్తం 47,517 మంది రైతులు నష్టపోయినట్లు నివేదికలో పేర్కొన్నారు. మొత్తం రూ.28.63 కోట్లు విలువ చేసే పంట నష్టం జరిగినట్లు నివేదికలో వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

పరిహారానికి ప్రతిపాదనలు

నియోజకవర్గంలో వివిధ పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించడానికి వీలుగా వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. మొత్తం రూ.28.63 కోట్ల పంటనష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. మండలాల వారీగా వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టం వివరాలను అంచనా వేసి పంపారు. ఎంతమంది రైతులు ఏఏ పంటలు నష్టపోయారు. ఎంత విస్తీర్ణంలో పంట నష్టం జరిగింది? తదితర వివరాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించారు.

మడకశిర నియోజకవర్గంలో పంటనష్టం వివరాలు ఇలా..

మండలం	రైతులు	విస్తీర్ణం (హెక్టార్లలో)	పంటనష్టం
గుడిబండ	11,484	4,447	రూ.6.55 కోట్లు
అగళి	9,035	3,337	రూ.4.33 కోట్లు
మడకశిర	9,145	4,069	రూ.5.76 కోట్లు
అమరాపురం	7,066	3,732	రూ.5.84 కోట్లు
రొళ్ల	10,787	4,114	రూ.6.15 కోట్లు
మొత్తం	47,517	19,701	రూ.28.63 కోట్లు

పరిహారం అందించేందుకు కసరత్తు

రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది ఖరీఫ్‌లో నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం అందించడానికి కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం పంట నష్టం వివరాలను అధికారుల వద్ద నుంచి తెప్పించుకుంది. నష్టపోయిన రైతుల జాబితాలు ఇప్పటికే ప్రభుత్వానికి చేరాయి. ఎన్ని హెక్టార్లలో ఏ ఏ పంటలు నష్టపోయారు? తదితర వివరాలను కూడా ప్రభుత్వం తెప్పించుకుంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ప్రతిపాదనలు పంపాం



ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షం రాకపోవడంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రధానంగా వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయింది. ఐదు మండలాల పరిధిలో 19,701 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. రూ.28.63 కోట్ల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. 47,517 మంది రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని కోరాం. త్వరలోనే నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

రైతుకు అండగా ఉంటాం



ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలబడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల పక్షపాతి. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించడానికే పంటనష్టం వివరాలను తెప్పించుకుంది. ఇన్‌పుట్ సబ్సిడీని అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సాధ్యమైనంత త్వరగా పరిహారం అందించి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతుంది.

– తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


హోమం నిర్వహిస్తున్న పురోహితులు

మడకశిరరూరల్: మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధ్వజసంభ ప్రతిష్ట, కుంభాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే ఆలయంలో పురోహితులు హోమాలు, పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రామాంజనప్ప అనే భక్తుడు నూతనంగా తయారు చేసి ఏర్పాటు చేసి ధ్వజసంభాన్ని ప్రతిష్టించారు. రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు దంపతులు, సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, మండల కోఆప్షన్ సభ్యులు ప్రకాష్, మండల బూత్ మేనేజర్ మంజునాథ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ వర్గీయులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లికి చెందిన ధనుంజయ, ప్రభాకర్‌స్వామి టీడీపీని వీడి ఆదివారం భక్తరపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు ప్రకాష్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్ వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డురాదు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

హిందూపురం టౌన్: ప్రతిభకు వైకల్యం అడ్డు రాదని, ప్రతి ఒక్కరూ కష్టపడే మనస్తత్వం కలిగి ఉండాలని ఎంఈఓ గంగప్ప అన్నారు. ఆదివారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో జాతీయ అంధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నిక్కీ ఉజిసిక్, సంజీవరాయ శర్మ, స్టీఫెన్ హాకింగ్ వంటి వారు వికలాంగత్వాన్ని జయించారని చెప్పారు. అలాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురి ప్రశంసాపత్రాలు అందజేశారు. సభ్యులు నాగార్జున, నాగరాజు, భవిత కేంద్రం టీచర్స్ లలిత, నందిని, వివిధ మండలాల ప్రతిభావంతుల ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రహ్మ రథోత్సవం కమిటీ ఎంపిక


నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం దేవదాయశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. స్థానికుల సహకారంతో బ్రహ్మరథోత్సవ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా నాగభూషణ్, సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంత్, ఎం నారాయణప్ప, నరసింహమూర్తి, నారాయణప్ప, కేటీ నారాయణప్పను ఎన్నుకొనగా, వారితో ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సర్పంచులు కరియన్న, రామాంజినేయులు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, వైస్ ఎంపీపీ మూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, మండల కోఆప్షన్ సభ్యులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: పట్టణంలోని 7వ వార్డులో ఆదివారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు అమలు చేసి పేదలకు మేలు చేశారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయరాజ్, నగేష్, గోపి, నవీన్, చిరు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మడకశిర: పట్టణంలో ఆదివారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి సర్కిల్‌లో పారిశుధ్యం పనులను పరిశీలించారు. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ట్రాక్టర్‌లో తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు చెత్తా చెదారాన్ని రోడ్లపైకి వేయవద్దని కోరారు. పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. ఆయనతో పాటు ఏఈ మురళి తదితరులు ఉన్నారు.

ముడి సరుకు తోలి మోసపోయాం


కర్మాగారం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు

హిందూపురం అర్బన్: ముడి సరుకు (తుక్కు ఇనుము) సరఫరా చేసి మోసపోయాం.. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం' అంటూ చిత్తూరు, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు చెందిన బాధితులు ఆదివారం తూమకుంట పారిశ్రామికవాడలో ఉన్న శ్యామ్ ఫెర్రోస్ స్టీల్స్ పరిశ్రమ ముందు ఆందోళన చేశారు. కర్మాగారం గేటు ముందు వారు వాహనాలను అడ్డుగా పెట్టి ఆందోళన చేశారు. చిత్తూరుకు చెందిన బాధితులు షేక్‌రిజ్వాన్, రెహమాన్ మాట్లాడుతూ శ్యామ్ ఫెర్రోస్ స్టీల్స్ పరిశ్రమ కర్మాగారానికి కొంత కాలంగా ముడి సరుకును సరఫరా చేస్తున్నామన్నారు. పెద్దమస్తాన్ ఎంటర్ ప్రైజెస్‌కు రూ.97.35 లక్షలు, మదీనా స్టీల్స్‌కు రూ.7.87 లక్షలు, ఫెర్రోన్ సొల్యూషన్స్‌కు రూ.1.16 కోట్లు, అర్పత్ ట్రేడర్స్‌కు రూ.కోటి ఇవ్వాల్సి ఉందన్నారు. 10 రోజుల్లోనే డబ్బు చెల్లిస్తామని చెప్పి 10 నెలలు గడిచినా డబ్బు ఇవ్వలేదన్నారు. స్థానిక రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. యాజమాన్యం తమకు డబ్బు చెల్లించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు.

సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు


మాట్లాడుతున్న సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ

హిందూపురం: గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులపై ఐసీడీఎస్ సిబ్బంది చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు తగవని గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆందోళనలు చేస్తూ హక్కుల సాధన కోసం ఉద్యమించడం ఐసీడీఎస్ సిబ్బంది హక్కేనన్నారు. అయితే సచివాలయ ఉద్యోగులపై వ్యతిరేకంగా ప్రకటనలు, ప్రచారాలు చేయడం సరి కాదన్నారు. అలాంటి వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంగన్వాడీ సెంటర్లపై తమకు ఎలాంటి వ్యతిరేక ఆలోచన లేదన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాలు పాటించడం తమ విధి అన్నారు. సమావేశంలలో రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మర్రి కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌సుధాకర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేడుకగా సామూహిక వివాహాలు


సామూహిక వివాహాలు జరిపిస్తున్న దృశ్యం

హిందూపురం: భగవాన్ సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా హిందూపురం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ ధర్మశాల కల్యాణ మండపంలో ఉచిత సామూహిక వివాహాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సత్యసాయిబాబా చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం కల్యాణ వేదికపై ఏడు జంటలకు సంప్రదాయబద్ధంగా వివాహాలను జరిపించారు. అనంతరం వివాహాలకు విచ్చేసిన వారికి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఓ.సత్యనారాయణమూర్తి, జిల్లా, రాష్ట్ర పదాధికారులు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్, సేవాదళ్ సభ్యులతో పాటు కార్యక్రమ ప్రధాన దాత దాస సతీష్, నాగలక్ష్మి కుటుంబ సభ్యులు నూతన వధూవరులకు బంగారు తాళిబొట్టు, పెండ్లి బట్టలతో పాటు ఇంటికి కావాల్సిన సామగ్రి అందజేశారు.

రెడ్డిపల్లిలో.. కనకదాస జయంతి


జ్యోతులను మోస్తున్న మహిళలు

రొద్దం: మండల పరిధిలోని రెడ్డిపల్లిలో ఆదివారం కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ప్రదర్శన చేసి మొక్కులు తీర్చుకున్నారు. కనకదాస చిత్ర పటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. గొరవయ్యల నృత్యాలు చూపర్లను ఆకట్టుకున్నాయి.

హైవేపై చికెన్ వ్యర్థాలు


రహదారి పక్కనే పడివేసిన చికెన్ వ్యర్థాలు

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమ రాకతో జాతీయ రహదారికి ఇరువైపులా హోటల్లు, దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. పెనుకొండ 44వ జాతీయ రహదారి గుట్టూరు జంక్షన్ వద్ద గ్రామానికి చెందిన పలువురు చికెన్ సెంటర్ల నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను జాతీయ రహదారి పక్కనే వేస్తున్నారు. దీంతో వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ భరోసా ఇచ్చారు. పట్టణంలోని చెన్నకేశవనగర్‌లో తాలూకా మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ నాయకుల కోరిక మేరకు పట్టణంలో త్వరలో ఆటోనగర్ నిర్మిస్తానన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు.

అక్షింతల ఊరేగింపు

పరిగి: అయోధ్య రామయ్య అక్షింతలను ఆదివారం మండలంలో ఊరేగించారు. సేవామందిరంలో ఉన్న శ్రీరామ దేవాలయం నుంచి పరిగిలో ఉన్న శ్రీరామ ఆలయం వరకూ అక్షింతలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. జనవరి 1 నుంచి ప్రతి ఇంటికీ అక్షింతలు అందిస్తామని కొండూరు నవీన్, శివశంకర్, బద్రీనాథ్ తెలిపారు.

మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం

హిందూపురం: మందులు క్రమం తప్పకుండా వాడుతూ జాగ్రత్తలు పాటిస్తే మూర్ఛవ్యాధిని నియంత్రించవచ్చని జెవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ధనుర్మాస పూజలు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో వెలసిన అతి పురాతనమైన ప్రసన్న లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలను చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనిధిభట్టాచార్యులు వెంకటేశ్వరస్వామికి వివిధ రకాల పూజలను చేశారు. ఆదివారం నుంచి జనవరి 16వ తేదీ వరకూ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు.

పులమతిలో గోమాత పూజలు

లేపాక్షి: యోగి నారాయణ సేవా సమితి హిందూపురం ఆధ్వర్యంలో మండలంలోని పూలమతిలో అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద ఆదివారం గోమాత పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీక్షేత్ర కైవారం తాతకు అభిషేకాలు, గురుపూజ, నగర సంకీర్తన, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం


పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

హిందూపురం టౌన్: ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్ హిలాల్ పాఠశాలలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 13 మంది పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి నరసింహులు, ఓబులేషు, నాగరాజు గుప్త, రామకృష్ణ, అక్బర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలోని వేంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఆదివారం తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పెన్షనర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ మల్లికార్జున, గౌరవాధ్యక్షుడు శాంతవీరప్ప, ఉపాధ్యక్షుడు గణపతి, సెక్రటరీ ఫక్రుద్దీన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

సోమందేపల్లి: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ సురేష్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ పరిశీలించారు. ఆదివారం ఈదుళబలాపురం, గుడిపల్లి, జూలకుంట ఆనందపురం గ్రామాల్లో వారు పర్యటించారు. రూట్ మ్యాప్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పావగడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హెల్ప్ సొసైటీ, బెంగళూరు ఆకాశ్ ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 680 మంది వివిధ రోగులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకున్నారు. వీరిలో 44 మంది రోగులు శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. వైద్యులు కిరణ్, దివ్య, మాఫిద, ధనుష్, గౌతమ్, అనురూఫ్రేష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

హిందూపురం అర్బన్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని ఎల్‌ఆర్‌జీ విద్యాసంస్థల చైర్మన్ సుమంత రామమూర్తి తెలిపారు. కిరికెరలోని ఎల్‌ఆర్‌జీ పాఠశాలలో ఆదివారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎల్‌జీ రామమూర్తి జయంతిని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు రక్తదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో పుష్పార్చన



హిందూపురం: పట్టణంలోని గోవిందమాలధారులు ఆదివారం వేంకటేశ్వరస్వామికి పుష్పార్చన చేశారు. ముందుగా వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని భక్తిశ్రద్ధలతో పట్టణంలో ఊరేగించారు. అనంతరం స్థానిక మున్సిపల్ ఆఫీసు వద్ద ఉన్న శ్రీనివాసమందిరంలో పుష్పార్చన నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అర్చనలు, పూజలు చేశారు.